విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 13, మార్చి 2025

సీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు సేవలందిస్తాం

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో (ప్రభుత్వ ఆసుపత్రిలో) రోగులకు 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వైద్యాధికారి రోహినాథ్ తెలిపారు. బుధవారం ఆస్పత్రిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు, వైద్యాధికారిగా నూతనంగా ఆస్పత్రికి రావడంతో ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ రోహినాథ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతిరోగిని మంచిగా పలకరించి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, హాస్పిటల్లో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు వైద్యం అందిస్తామన్నారు. వైద్యులు రంగనాయకులు, చంద్రకళ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో బుధవారం కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు స్థల పరిశీలన చేశారు. గ్రామ శివారులోని 348 సర్వే నెంబర్ లో 52 ఎకరాలు భూమిని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో గ్రామ పర్యటనలో వచ్చిన సందర్భంగా ఆదర్శ గ్రామంలో భాగంగా గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి 4 ఎకరాలు, కుటీర పరిశ్రమలు నిర్మాణాలకు 52 ఎకరాలు పరిశీలించినట్లు తెలిపారు.తహశీల్దార్ మునివేలు, సర్వేయర్ రవితేజ, వీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి..

విశాలాంధ్ర-ఉరవకొండ : స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో శ్రీ రేణుకాచార్యుల జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గవిమఠం సంస్థాన ఉత్తరధికారి కరిబసవ రాజేంద్ర స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మంలో స్పష్టమైన వీరశైవ ధర్మ సంస్థాపన చేసిన మొట్టమొదటి వారు రేణుకాచార్యుల స్వాముల వారని తెలిపారు. వీరశైవ మతంలో అన్ని ఉప కులాలు ఐక్యంగా సంఘటితమై వీరశైవ ధర్మ సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు రాకెట్ల వీరేష్ స్వామి, ఆమిదాల యోగి స్వామి, కిరణ్ స్వామి, మఠ రామలింగ స్వామి, పాటిల్ నాగనగౌడ్, దేశాయ్ గంగాధర్, చంద్రిక మల్లికార్జున ఆర్‌డిటి మల్లికార్జున, పాటిల్ నిరంజన్‌గౌడ్, దేశాయ్ వీరేష్ పాల్గొన్నారు.

జై కిసాన్, నిస్వార్థ ఫౌండేషన్ సేవలను అభినందించిన ఎస్పీ

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎస్పీ ఆఫీసు కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగిన అనంతపురం ఎన్జీవో సమ్మేళనం కార్యక్రమంలో అనంతపురం జిల్లాలో వివిధ రంగాలలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు చేస్తున్న సామాజిక,పర్యావరణ చైతన్య కార్యక్రమాలను ఎస్పీ జగదీష్ అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా ఉరవకొండ ప్రాంతానికి చెందిన నిస్వార్థ ఫౌండేషన్, జై కిసాన్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అభినందించారు ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ సామాజిక బాధ్యత కలిగినటువంటి ఎన్జీవోలను పేరుపేరునా ఎస్పీ అభినందించారన్నారు. అందరినీ ఒకే వేదిక మీదికి తెచ్చిన డిస్కవరీ అనంతపురం అధినేత అనిల్‌కుమార్‌ని కూడా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపక అధ్యక్షులు రజిని కుమారి మరియు నిస్వార్థ ప్రతినిధి ముక్తం శ్రీనివాసులు పాల్గొన్నారు

గుండాల తండాలో సమీక్ష

విశాలాంధ్ర-గుంతకల్: స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా గుంతకల్ మండలంలోని గుండాల తండాకు శనివారం కలెక్టర్ డాక్టర్ వినోద్ గుండాల తండా గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిస్టిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి.రామాంజనేయులు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎమ్మార్వో రమాదేవి, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, హాజరై గుండాల తండాలో శానిటేషన్, నీటి కొళాయిలు, వ్యవసాయం ఉత్పత్తుల, రోడ్లు డ్రైనేజీలు చెత్తబుట్టల విధానం పైన అలాగే ఊరికి స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామానికి కలిపి రెండు హ్యాండ్ బోర్లు ఉన్నాయి కానీ అవి పనిచేయలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్డబ్ల్యూఎస్ ఫాతిమా, ఎంఈఓ మస్తాన్, వైద్యాధికారి మహేష్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా తాగితే అనారోగ్యం

విశాలాంధ్ర-కనేకల్ : మండల పరిధిలోని హనకన్ హాల్, పెనుకలపాడు గ్రామంలో బుధవారం ప్రోహిబిషన్, ఎక్సైజ్‌శాఖ నవోదయం 2.0లో భాగంగా సారాకు దూరం, నీ ఆరోగ్యం మహాభాగ్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సారాకు బానిసైతే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, సంసార బంధాలు జీవితాలు నాశనం అవుతాయని అందుకే సారా వద్దు అంటూ నాట్య మండలి వారు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ వారు బడి పిల్లలు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిట్స్‌లో డ్రోన్ టెక్నాలజీ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (మిట్స్) కళాశాలలో బుధవారం డ్రోన్ టెక్నాలజీ క్లబ్‌ను ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపల్ డా.సి యువరాజ్ పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ రంగంలో ఆవిష్కరణ, పరిశోధన, నైపుణ్య అభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో డ్రోన్ టెక్నాలజీ క్లబ్‌ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మానవరహిత వైమానిక వాహనాలు లో తాజా పురోగతులను, వివిధ పరిశ్రమలలో డ్రోన్‌ల అనువర్తనాలను, డ్రోన్ ఆపరేషన్, డిజైన్‌లో ఆచరణాత్మక శిక్షణను అన్వేషించడానికి విద్యార్థులు, పరిశోధకులు, సాంకేతిక ఔత్సాహికులకు ఈ క్లబ్ ఒక వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. డి.చంద్రశేఖర్, ఇంజనీర్, డ్రోన్ పైలట్, సుబే దార్ రవిలు ఏరీస్ సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) మాట్లాడుతూ.. వ్యవసాయం, రక్షణ, నిఘా, విపత్తు నిర్వహణ వంటి రంగాలలో వైమానిక రోబోటిక్స్, ఆటోమేషన్, విద్యార్థులకు రియల్-టైమ్ ప్రాజెక్టులలో, వాస్తవిక విషయాలను విద్యార్థులకు చేరువ చేస్తూ ఉన్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, క్లబ్ కో ఆర్డినేటర్ రిజ్వాన్ పాల్గొన్నారు.

అరటి రైతులను దళారుల బారినుండి కాపాడండి..

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: జిల్లా వ్యాప్తంగా ఉన్న అరటి రైతులను దళారుల బారి నుండి కాపాడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోలకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఆరటి రైతుల పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉందని, ఒక్కోరైతు ఎకరా, రెండు ఎకరాల సొంత పొలంతో పాటు పక్కనున్న మూడు, నాల్గు ఎకరాలు కౌలుకు తీసుకుని మట్టిని తోలి.. పశువులు ఎరువులతో దుక్కి దున్ని ..ప్రైవేట్ షాపులునుంచి అధిక ధరలకు డ్రిప్పు పరికరాలు తీసుకొని వేసవికాలంలోనే అరటి మొక్కలు నాటుకొని లక్షలాది రూపాయలు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి అప్పులు తీసుకొని పంటలు సాగు చేస్తే చివరకు అరటి కోనుగోలుచేసే కంపెనీలతో దళారులు కుమ్మక్కై ధరలు అమాంతంగా తగ్గించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత15 రోజుల క్రింద టన్ను అరటి ధర రూ.27లు వుంటే ప్రస్తుతం ధర రూ.14 వేలుకు పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో నష్టాల పాలౌతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రంగం లోకి దిగి దళారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అరటి రైతు నుండి ప్రభుత్వమే టన్నుకు రూ.25 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్, జిల్లా కౌలు సంఘం అధ్యక్షులు వీటీ రామాంజనేయులు రైతు సంఘం నాయకులు గోపాలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల జేకేసీ జాబ్ మేళాపై విచారణ చేపట్టాలి..

ఆర్‌జేడికి ఏఐఎస్ఎఫ్ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో -అనంతపురం: అనంతపురం నగరంలో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో 2023- 24 సం.. జే కేసి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని బుధవారం ఆర్జెడి నాగలింగా రెడ్డికి ఏఐఎస్ఎఫ్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య వినతి పత్రాన్ని అందజేశారు. రెండేళ్లలో కళాశాల అకౌంట్లో డ్రా చేసి అభివృద్ధి పనులకు వాడుకున్న దానిపైన సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్, యాదవ్ మాట్లాడుతూ.. జాబ్ మేళాలో క్యాటరింగ్ వారికి విచ్చలవిడిగా డబ్బులు చెల్లించారని, సప్లయర్స్, ఫ్రూట్స్ పేరుతో భోజనం పేరుతో లాడ్జిల పేరుతో ప్రింటింగ్ ప్రెస్ పేరుతో వివిధ రూపాలలో లక్షల రూపాయలు ఇష్టానుసారంగా దోచేశారన్నారు. గతంలో జాబ్ మేళా నిర్వహించిన వాటి ఖర్చు వివరాలలో రానివారికి కూడా వచ్చినట్టు చూపించి ఒక్కొక్క విద్యార్థికి రూ. 60ల నుంచి రూ100 భోజనం ఏర్పాటు చేసినట్టు బిల్లులు రాశారు. కనీసం వంద మంది విద్యార్థులకు భోజనం పెట్టి ఉంటే వెయ్యి మందికి పెట్టినట్టు బిల్లులు రాశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క జే కే సి కోఆర్డినేటర్ పేరు మీద లక్షల రూపాయలు డబ్బులు ఏవిధంగా డ్రా చేశారు.. జెకెసిలో రెండు సంవత్సరాలుగా స్వీపర్లగా పని చేయించుకొని వారికి డబ్బులు చెల్లించకుండా స్వీపర్ పేరుతో డబ్బులు డ్రా చేసి కాజేశారని ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు మంజునాథ్, నాయకులు, పవన్, రమేష్ గణేష్ ,ముఖేష్, యశ్వంత్, కార్తీక్ పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-అనంతపురం : ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ముస్లింలపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల భేషరతుగా ముస్లింలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ మైనారిటీ వింగ్ నగర ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మార్చి4వ తేదీన స్థానిక రాయచోటిలో శ్రీ వీరభద్ర స్వామి ఊరేగింపు సందర్భంగా జరిగిన గొడవ గురించి అసెంబ్లీలో ప్రస్తావనకు తెచ్చారన్నారు. ప్రజల చేత ఆదోని ఎమ్మెల్యేగా ఎన్నుకోబడిన పార్థసారధి ముస్లిం, హిందూ, క్రైస్తవులు అందరూ కలిసి ఓటు వేస్తేనే గెలిచారని మర్చిపోయారని తెలిపారు. శాసనసభలో ముస్లింలకు అల్లరి మూకలు అని అనుచితంగా మాట్లాడడం ఆయన ఆలోచన దాష్టీకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఏ మూల ఎలాంటి గొడవ జరిగినా ఇరు వర్గాల తప్పు లేనిదే జరగదు అన్నారు. రాయచోటి గొడవలో నిజానిజాలు ఏంటో తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. గొడవ జరుగుతున్నపుడు అక్కడ పోలీసులు ప్రజలు ఉన్నారన్నారు. .ఎవరైతే ఈ గొడవకు నాంది పలికారో, ఎవరైతే శాంతిని భంగం కలిగించాలని చూసారో వారిని అరెస్టు కూడా చేయడం జరిగిందన్నారు.తప్పు ఎవరు చేసినా తప్పే... ఒక వర్గానికి టార్గెట్ చేసి మాట్లాడటం మాత్రం సమంజసం కాదని హితవు పలికారు. అరెస్టు అయిన వారి కోసం న్యాయ పరమైన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి మతపరమైన గొడవలను ఎప్పటికి సమాజానికి మంచిది కాదన్నారు. ఈ సమస్యను ఇంకా జటిల పరిచేలా ఒక ఎమ్మెల్యే వ్యవహరించటం శాసనసభకే అవమానకరమన్నారు. ఎప్పటికైనా శాంతిస్థాపన గురించి ఆలోచించాలి తప్ప ఒక గౌరవప్రదమైన ఎమ్మెల్యే హెూదాలో ఉండి వర్గ విభేదాలు సృష్టించేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. సిఎం కలగచేసుకుని పార్థసారథి మీద కమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గంలోని పవిత్ర స్థలాలను అభివృద్ధి చేయండి..

ఎమ్మెల్యే బండారు శ్రావణి

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల నియోజకవర్గంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలు, దేవా లయాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవా లని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి రామనారా యణ రెడ్డికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ బుధవారం వినతిపత్రం అంద జేశారు. నియోజకవర్గ పరిధిలోని గూగూడు కుల్లాయి స్వామి ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళ నాడు, కర్ణాటక నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొంటారని, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ, పర్యాటక పుణ్యక్షేత్రంగా గుర్తింపు ఇవ్వాలని కోరారు. శింగనమల మండలంలోని పురాతన చరిత్ర కలిగి, కొండలో వెలసిన శ్రీ రుష్య శ్రుంగ మునీశ్వర దేవాలయానికి రోడ్డు సౌకర్యం కల్పించి గుడి అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని దేవరకొండ కొండమీదరాయుడి దేవాలయంలో ఇటీవల అరుణాచాల అఖండ జ్యోతి తర్వాత మొట్టమొదటి సారిగా ఇక్కడ అఖండ జ్యోతి ఏర్పాటు చేయబడిందని. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో దేవాలయ భూమికి సంబంధించి ఆక్రమణలు తొలగించి, భక్తులకు గిరి ప్రదర్శన కొరకు సౌకర్యాలు కల్పించాలని వినతి చేశారు. సమస్యలన్నీ విన్న మంత్రి వాటిపై సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గ్రానైట్ నాపరాళ్ల పరిశ్రమల సమస్యలను పరిష్కరించండి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి వినతి..

విశాలాంధ్ర-తాడిపత్రి : గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి గ్రానైట్ నల్లబండల పరిశ్రమల యజమానులతో కలిసి బుధవారం అమరావతిలోని సచివాలయ కార్యాలయంలో చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తూ తాడిపత్రి ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందడంలో ప్రధాన పాత్ర పోషించాయన్నారు. గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ సర్ చార్జీలు, రాయల్టీ చార్జీలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా దివాలా తీసిన గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలను ఆదుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. దీనికి చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : విద్యార్థి, యువత సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో అనంత నగరంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేశారు. కలెక్టరేట్ వద్ద వైసీపీ నేతలు ప్రసంగించాక కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువత, విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని అనంత వెంకటరామిరెడ్డి వివరించారు. గతేడాది ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన వసతి దీవెన పరిస్థితి కూడా అంతేనని పేర్కొన్నారు. యువతకు ఇచ్చిన హామీలను కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ప్రతి నిరుద్యోగికీ రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో పెట్టారన్నారు. ఈ హామీని అమలు చేయాలంటే ఏడాదికి రూ.7,200 కోట్లు ఖర్చు చేయాలని, కానీ గతేడాది బడ్జెట్లో, ఈ ఏడాది కూడా ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని.. ఈ రెండు పథకాలకు సరిపడా నిధుల విడుద లకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, గతేడాది బకాయిలతో పాటు చెల్లించాలన్నారు. పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేసే చర్యలను విరమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గాల సమన్వయ కర్తలు తలారి రంగయ్య, వై.విశ్వేశ్వరరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, వైసీపీ యుజవన విభాగం జోనల్ అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, వైసీపీ యువ జన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర- రాష్ట్ర కార్మికుల హక్కులు కాలరాస్తే సహించేది లేదు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కేంద్రంలో రాష్ట్రంలో కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలకప కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఏఐటియుసి జిల్లా సమితి పిలుపునిచ్చింది. బుధవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె. రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలోని అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ. 26లు వేతనం ఇవ్వాలని పదేపదే చెప్తారు. ప్రధాని మాత్రము అత్యున్నత న్యాయస్థానం జవదాట దని పదే పదే చెబుతారు ఈ తీర్పును ఎందుకు అమలు చేయరని రాజారెడ్డి నిలదీశారు. అమలు చేసేది ఎవరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న మీరే అమలు చేయాల్సిన బాధ్యత పాలకులదేనని క చట్టబద్ధత కల్పించే వరకు దేశవ్యాప్తంగా అందోళన కొనసాగుతుందన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులందరికీ ఒకటే వేతనం అమలు చేయాలని, మెడికల్ రంగంలో పనిచేసే కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ చెల్లించాలని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం దేనని, ఆశ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని, లారీ డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వావిదేన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, జిల్లా ఆఫీస్ బేరర్లు జి చిరంజీవి,సి.రాజు,నాగవేణి,ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెడికల్ యూనియన్ జిల్లా కార్యదర్శి మనోహర్, మున్సిపల్ యూనియన్ జిల్లా కౌన్సిల్ మెంబర్స్ నాగేంద్రబాబు,శివకృష్ణ, తిరుమలయ్య, ఎర్రప్ప, హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు అక్బర్ బాషా,నారాయణ, రాము, లారీ డ్రైవర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు సైఫుల్ల,ఆటో డ్రైవర్ జిల్లా కోశాధికారి కృష్ణ నాయక్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నాయకులు బాషా, ఆటో యూనియన్ నాయకులు రమేష్,స్కూల్ స్విపర్స్ వాచ్మెన్లు హసేన్,లక్ష్మీదేవి,శివ,మెడికల్ యూనియన్ నాయకులు నల్లమ్మ, రామాంజనేయులు, భార్గవి, మంజుల, లక్ష్మీదేవి, ఫమిద, ప్రమిళ,వన్నూరు సాబ్, ఆర్టీసీ పోటర్స్ నాయకులు నాగరాజ్,షేక్షావలి,గుంతకల్ హమాలీలు పాల్గొన్నారు.

అనంతపురం నగరంలో ఈనెల 22-23 తేదీల్లో అనంతపురం కృష్ణ గార్డెన్లో ఏఐటియుసి జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కె.కృష్ణుడు అధ్యక్షతన నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికులను ఏఐటియుసి నాయకులను సైదాంతికంగా, అభ్యుదయంగా, రాజకీయంగా మానసికంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ శిక్షణ తరగతులు దోహద పడతాయిన్నారు. కార్మికులందరూ జిల్లా వ్యాప్తంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమష్టి కృషితో సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర అనంతపురం క్రైం: ఎన్జీవోల ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలు, క్రైం అగనెస్ట్ ఉమెన్ పట్ల ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు పోలీస్ శాఖ తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని ఎస్పీ జగదీష్ కోరారు.బుధవారం జిల్లాలోని ఎన్జీవోలు (స్వచ్ఛంధ సేవా సంస్థలు) ప్రతినిధులతో స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే చాలా స్వచ్ఛంధ సంస్థలు జిల్లాలో వివిధ మార్గాలలో ప్రజలకు స్వచ్ఛంధంగా సేవలు అందిస్తున్నాయని, ఈ సేవలతో పాటు పోలీసులతో కలిసి ప్రజల్లో సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలు, క్రైం అగనెస్ట్ ఉమెన్ తదితర నేరాలపై ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషి చేయాలని కోరారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించకుండా రోడ్డు ప్రమాదాల బారినపడి అర్ధాంతరంగా చని పోతుండటం అందరికీ బాధ కల్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసుశాఖ, ప్రభుత్వం చాలా చర్యలు చేపట్టిందన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, ఫోక్సో మరియు మహిళా సంరక్షణ చట్టాలు, తదితర అంశాలపై ఇప్పటికే అవగాహన కల్పించామని చెప్పారు.

మహిళలతోనే సుస్థిరాభివృద్ధి

వీసీ సుదర్శన్ రావు

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: మహిళలతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమని జేఎన్టీయూఏ వీసీ ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఉమెన్ ఎంపవర్మెంట్, కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ, ఎస్కేయూ ఇన్చార్జి వీసీ ఆచార్య బి.అనిత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.చిన్నరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జేఎన్టీయూ వీసీ మాట్లాడుతూ.. మహిళలు క్రీడా, సైనిక, సేవ, వైమానిక రంగాల్లో తమదైన ప్రతిభను చాటుతూ దేశభ్యున్నతికి తోడ్పాటును అందిస్తున్నారని.. మహిళల్లో ఓర్పు, శాంతం, పట్టుదలతో కుటుంబ, దేశం రెండు కళ్ళుగా భావిస్తూ ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ఎస్కేయూ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య బి.అనిత మాట్లాడుతూ.. నేటి భారతీయ మహిళల విద్య, మీడియా, కళలు, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాలలో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్. వి.బి. చిత్ర, కళాశాల ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కోఆర్డినే టర్ అజిత, డైరెక్టర్లు, జి.వైశాలి ఘోర్పాడే, పి.సుజాత, ఆర్.కిరణ్మయి, ఆర్.పద్మ సువర్ణ, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య కె.మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-నార్పల : బీసీ, ఈబీసీలకు చెందిన కమ్మ రెడ్డి క్షత్రియ వైశ్య బ్రాహ్మణ కాపు బలిజ కులాలకు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చి శిక్షణ పూర్తి అయిన తర్వాత కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో గంగావతి బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. 18 నుండి 50 సంవత్సరాల వయసు, లబ్దిదారులు ఆధార్ కార్డు రేషన్ కార్డు, కులం ఆదాయం సర్టిఫికెట్లు తీసుకొని దగ్గరలోని సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టైలరింగ్ శిక్షణ కాలంలో 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండి, ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ద్వారా పరిగణంలోకి తీసుకొని కుట్టు మిషన్ ఇవ్వడం జరుగుతుంది. మార్చి 8 నుండి 22 వరకు గడువు ఉందన్నారు.

570 మర్కులొస్తే విమాన ప్రయాణం

విశాలాంధ్ర-బెలుగుప్ప : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షరాసే విద్యార్థులు 570 మార్కులు సాధిస్తే వారందరినీ సొంత ఖర్చులతో ఎంఈఓ బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు విమానమెక్కిస్తానని ఎంఈఓ మల్లారెడ్డి ప్రకటించారు. ఇదిలా ఉండగా విమానంలో ప్రయాణించేవారికి ఒక్కొక్కరికీ ప్రయాణ ఖర్చులకు రూ.5 వేలు ఇస్తానని ఎంపిపి పెద్దన్న తెలిపారు. విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు బంపర్ ఆఫర్ ప్రకటించిన ఎంఈఓ మల్లారెడ్డి, ఎంపిపి పెద్దన్నలను హెడ్ మాస్టర్ వెంకటప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్యల అభినందించారు. పేద విద్యార్థులకు ఈ అవకాశం దోహదపడుతుందని తెలిపారు

స్మశాన వాటికను పరిరక్షించాలి

కమిషనర్‌కు వినతి..

విశాలాంధ్ర గుత్తి : పట్టణ శివారులోని వక్కలకుంట సమీపంలో హిందూ శ్మశాన వాటిక కబ్జాకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయాకు దాసరి వీధి కాలనీ ప్రజలు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు సునీల్,రంగయ్య మాట్లాడుతూ.. శ్మశాన వాటిక కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, శ్మశానం వద్ద సీసీ రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-గుత్తి : పట్టణం కె ఎస్ కే టూ సెండ్ సెంటర్ లో గురువారం కే ఎస్ కే టూషన్ సెంటర్ల అధినేత సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాధన స్కూల్ కరస్పాండెంట్ పిల్లెలి కృష్ణయ్య, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకుడు దేశాయి నాగరాజ్, తొండపాడు ఉపాధ్యాయులు శ్రీధర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్యాడ్స్,పెన్నులు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయడం హర్షనీయమని, ఇలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సునీల్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. అనంతరం సునీల్ కుమార్ మాట్లాడుతూ కె ఎస్ కె ట్యూషన్ సెంటర్లలో మొత్తం 180 మంది విద్యార్థులకు నేడు ఉచితంగా ప్యాడ్స్,పెన్నులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థాయిలో మార్కులు సాధించాలని కోరుకున్నట్టు తెలిపారు. ఇలా ప్రతి సంవత్సరం ప్యాడ్స్ పెన్నులు ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నామని తెలిపారు.

ఘనంగా శ్రీ రేణుక చార్య జయంతి

విశాలాంధ్ర-కనేకల్ : గ్రామంలోని బుధవారం వీర శైవ సంఘం వారి ఆధ్వర్యంలోన వీరశైవ ధర్మ సంస్థాపకులు శ్రీ రేణుకాచార్య భగవత్పాదుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ రేణుకచార్యుల స్వామి వారి చిత్రపటాన్ని గ్రామ తిరు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు.

గిరిజన భూములను కాజేసిన వారిపై చర్యలు తీసుకోండి

గిరిజనులకు న్యాయం చేయండి
సిపిఐ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేత



విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజనుల భూ సమస్య పరిష్కారానికై తగు చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవి బ్రాహ్మణపల్లి తండా గిరిజనుల సమస్యపై పత్రికల్లో ఈ నెల 03వ తేదీన కథనం ప్రచురితం కావడంతో ఈ సమస్యపై ఈ నెల 4న నేను, శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి కామ్రేడ్ ఎం.వేమయ్య తదితరులతో కూడిన సిపిఐ బృందం అడవి బ్రాహ్మణపల్లి గిరిజనులకు కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నామని,. గత వైసిపి ప్రభుత్వ కాలంలో ముదిగుబ్బ మండల బిజెపి నాయకుడైన ఆదినారాయణ యాదవ్ తోపాటు వైసిపికి చెందిన సి.ప్రభాకర్రెడ్డి తండ్రి చిన్నారెడ్డిబీ ఎం. శాంతమ్మ భర్త ఎం. నారాయణరెడ్డి, సుకన్య భర్త సి.ప్రభాకర్ రెడ్డిలు కుమ్మక్కై ముదిగుబ్బ మండలంలో గిరిజనుల సాగులో ఉన్న దాదాపు 200 ఎకరాల పైబడి భూములను రెవిన్యూ రికార్డులలో (1బి, అడంగల్) అక్రమంగా వారిపేర్లు నమోదు చేయించుకున్నారని తెలిపారు. అలాగే చిలమత్తూరు మండలం, సోమగట్ట రెవిన్యూ గ్రామ పొలంలో సర్వే నెం: 24 నుండి 34 వరకు దళితులు, బిసిలకు కేటాయించిన అసైన్డ్ భూములు దాదాపు 73 ఎకరాలను ముదిగుబ్బ ప్రస్తుత ఎంపిపి ఆదినారాయణ యాదవ్ తన కుటుంబ సభ్యుల పేరున 1బి అడంగల్ అక్రమంగా నమోదు చేయించడంతో పాటు బ్యాంకుల ద్వారా కోట్లాది రూపాయల లోన్లు కూడా పొందారన్నారు. కోట్లాది రూపాయల రుణాలు తీసుకోవడమే గాక రుణమాఫీ, బీమా తదితర పథకాలను కాజేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందిస్తూ రెవెన్యూ శాఖ ద్వారా నివేదిక తెప్పించుకొని భూ కబ్జాదారులపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు

ఏప్రిల్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే అదనపు నిధులు

– కలెక్టర్ టీఎస్ చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి : 2025 ఏప్రిల్ లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేస్తుందని కలెక్టర్ టీఎస్.చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016 నుంచి 2021 - 23 వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయన్నారు. అలాంటి లబ్ధిదారులకు ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలో 71,969 ఇల్లు మంజూరు కాగా ఇందులో 25,203 ఇల్లు పూర్తయ్యాయని, మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వివిధ దశల్లో 16,123 లబ్ధిదారులు ఉన్నారని వారు త్వరితగతిన ఇల్లు ఏప్రిల్ నెలలోపు పూర్తి చేసుకుంటే వారికి అదనపు నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు కమ్యూనిటీ కార్యదర్శులు అర్హత కలిగిన ప్రతి ఇంటిని పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలను ఫోటోలు తీసి నివేదిక పంపాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు , ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత అధికారులతో విస్తృత ప్రచారం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నూతన మెలకువలతోనే విద్యార్థులకు ఉత్తమ బోధన

విశాలాంధ్ర-రొళ్ల: పాఠశాలలోని విద్యార్థులకు బోధించే పద్ధతులను పాటించి నూతన మెలకువలతో పాఠ్యాంశాలను బోధిస్తే విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడం సాధ్యమవుతుందని మండల విద్యాధికారి ఎస్.ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు.బుధవారం మండల పరిధిలో ఉన్న మూడు పాఠశాలల్లో మార్చి నెలకు సంబంధించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.అందులో భాగంగానే రొళ్ల,అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలకు ఎంఈఓ ఎన్.శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమావేశానికి వేరు వేరుగా హాజరై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి సెషన్‌లో భాగంగా ఫిబ్రవరి కాంప్లెక్స్ సమావేశంలో పలు అంశాల గురించి చర్చించారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఆరు నుండి పది తరగతిలోని సిడి గ్రేడ్‌లోని విద్యార్థులను పరీక్షల ఆధారంగా గుర్తించి వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు అలాగే బోధనలో భాగంగా ఒకటి రెండు తరగతులకు ఒత్తులకు సంబంధించి పాఠ్యాంశాన్ని రిసోర్స్ పర్సన్‌లు బోధించారు. పరిసరాల విజ్ఞానం వ్యవసాయం పాఠ్యాంశానికి, ఉన్నత తరగతులకు సంబంధించి హిందీ సబ్జెక్టులో పాఠ్యాంశాన్ని బోధించారు. ఈ విధంగా ప్రతి సెషన్స్‌లోను ఎజెండా వారీగా చర్చించడం జరిగిందన్నారు. బోధనలో నూతన మెలకువలను ఉపాధ్యాయులు తెలుసుకోవడానికి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీఆర్పీలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-కదిరి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం మూత్ర పిండాల (డయాలసిస్) ఆరోగ్యంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఉస్సేన్, డయాలసిస్ క్లినిక్ మేనేజర్ డా.మెహరాజ్ ఆధ్వర్యంలో పలువురికి అవగాహన కల్పించారు. ప్రతి యేటా మార్చి 13న ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. అపోలో డయాలసిస్ క్లినిక్ చెందిన ప్రముఖ నెఫ్రాలజిస్ట్ లు, వైద్యు నిపుణులు ఆధ్వర్యంలో అనేక చోట్ల నాణ్యమైన పరీక్షలు నిర్వహిస్తూ కిడ్నీ ఆరోగ్యంపై అవగాహన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సిఎస్ ఆర్ (క్రానిక్ కిడ్నీ డిసిజ్)బాధితుల సంఖ్య పెరుగుతుందని కిడ్నీ వ్యాధి పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ముందస్తు పరీక్షలు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పైసలిస్తేనే ఫోన్ లేస్తాది.. లేదంటే నో

ఆ శాఖలో మీడియేటర్లదే హవా

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ అవినీతి తిమింగలం దందా అడ్డు అదుపు లేకుండా పోతోంది. రైతులకు విద్యుత్ కనెక్షన్లు కావాలంటే పైసలిస్తే ఫోల్ లేస్తాది.. అదీప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ముతో పాటు అదనంగా ఆ అధికారికి ఇవ్వకుంటే, ఆ విద్యుత్ కనెక్షన్ నో నో చెబుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల వ్యాప్తంగా ఎంతోమంది నిరుపేద, సామాన్య రైతులు వ్యవసాయ బోర్ల కోసం ట్రాన్సుఫార్మర్లకు అప్లై చేసుకుంటే సీనియార్టీ ప్రకారం కనెక్షన్ ఇవ్వాల్సిన అధికారి నిబంధనలను గాలికి వదిలేసి కాసులకు కక్కుర్తి పడి ఇష్టారాజ్యంగా కనెక్షన్లు ఇచ్చేశారని తెలుస్తుంది. నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇటీవల వ్యవసాయ రైతుల కోసం 64 ట్రాన్సుర్మర్లను తెప్పించి అట్టహాసముగా రైతులకు ఇవ్వాలని, మరిన్ని ట్రాన్స్ఫార్మర్లు తెప్పిస్తా, ఇది రైతుల ప్రభుత్వం, రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక లాంటి వాడు అంటూ ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ లో బహిరంగంగా తెలిపాడు, అయితే ఇక్కడ ఇష్టారాజ్యముగా వ్యవహరిస్తూ ఎవరు డబ్బులు ఇస్తే వారికి ట్రాన్స్ఫార్మర్ కనెక్షన్ ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి, సీనియార్టీని పక్కనపెట్టి బడా బాబులకు, మీడియేటర్లు చెప్పిన వారికి అప్పనముగా అప్పజెప్పుతు సొమ్ము చేసుకుంటున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు, ఈ విషయంపై ఈ మండల స్థాయి అధికారిని వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు ఇచ్చారు, కావున ఎమ్మెల్యే కార్యాలయం వారు స్పందించి న్యాయమైన రైతులను సీనియార్టీ ప్రకారం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆ అధికారి ఏమంటున్నారంటే,... మండలంలో 25 మందికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు, తరువాత రైతుల వివరాల చెబుతూ 32 మంది లిస్టు ఇచ్చారు, ఇంకా32 ఉన్నాయన్నారు, స్థానిక విద్యుత్ కేంద్రంలో ట్రాన్ఫార్మర్లను కౌంట్ చేస్తే 49 ఉన్నాయి, మరల ప్రైవేట్ కాంట్రాక్టర్ అందులో 10 నావి అన్నారు ఇలా పొంతన లేని, స్పష్టత లేని, సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నాడు. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకే కనెక్షన్లు ఇస్తున్నామన్నారు, సామాన్య రైతులను ఆదుకోవాలంటే తమ చేతుల్లో లేదంటూ చేతులెత్తేశారు, ఆ అధికారి ఇలా సమాధానం చెబితే నిజమైన సీనియార్టీ రైతుల పరిస్థితి ఏమిటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి..

– ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని శాసనసభలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రస్తావించారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ సంక్షేమ పథకాలకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చి 10 ఎకరాల రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో వ్యవసాయ పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందించారని గుర్తు చేశారు.ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం సబ్సిడీలలో కోతలు విధించడమే గాక పథకాలను సక్రమంగా అమలు చేయలేదన్నారు. పెద్ద రైతులకు 45 శాతం సబ్సిడీ ,ఎస్సీ,ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ రాయితీతో మాత్రమే పరికరాలు అందించడం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని వ్యవసాయం పూర్తి సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఉమ్మడి జిల్లాను ఉద్యానవన పంటల హబ్ గా మార్చాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో డ్రిప్పు, స్పింకర్లు, వ్యవసాయ పరికరాలు అందించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చేన్నా యుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయం మేరకు ఆ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జాబ్ మేళాకు విశేష స్పందన..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని గుట్ట కింద పల్లిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ జే.వి.సురేష్ బాబు, ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా ఎంప్లాయిమెంట్ సీడాపు సంయుక్త అధికారి దీపక్‌రెడ్డి, సీడాప్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్‌చార్జి హరీష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఈ జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 5 కంపెనీ ప్రతినిధులు హాజరు కావడం జరిగిందని 56 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 32 మంది వివిధ కంపెనీలకు ఎంపిక కావడం జరిగిందని వారు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వారి స్వయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో శుభదాయకమని తెలిపారు. నిరుద్యోగులు ఇటువంటి జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవడం వల్ల వారి కాళ్ళ మీద వారు నిలబడి సంపాదించుకొనే అవకాశం ఉందని తెలిపారు. ముస్ముందు కూడా మరిన్ని జాబ్ మేళా కార్యక్రమాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, ప్లేస్మెంట్ అధికారి తేజ కుమార్, ఏపీ స్టేట్ సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సిడాప్ సిబ్బంది, ఎంప్లాయిమెంట్ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రూట అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-గోరంట్ల : గోరంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి అధ్యక్షతన రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట - ఏపి)రాష్ట్ర అదరపు ప్రధాన కార్యదర్శి ఫైరోజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు, ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయునుల ప్రతిభా సేవలు పిల్లలతో ఆత్మీయత, అభిమానం, ప్రేమ గురించి కొనియాడారు, అలాగే మరికొందరు మహిళలు సమాజ నిర్మాణంలో మహిళా పాత్ర స్త్రీలు ఉన్నత శిఖరాన్ని ఎదగడాన్ని విద్యా ప్రాముఖ్యత గురించి వివరించారు, అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ అయిషా, పాఠశాల ఉపాధ్యాయులు ఫర్ జాన పర్వీన్,ప్రతిభ భారతి, రూబీనా, సుగుణమ్మ ఎంపీపీ ఎస్ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు గుల్నాజ్‌లను ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయులు, రూట జిల్లా సంయుక్త అధ్యక్షులు మసివుల్లా, నబిరసూల్, ఆరిఫ్అలి, అల్లాబకష్, షాహిద్, పిడి.రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

ప్లంబర్లకు ఇచ్చిన స్థలాల్లో అక్రమాలపై విచారణ జరపాలి

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 650-2 సర్వే నంబర్ లో ప్లంబర్లకు ఇచ్చిన స్థలాలలో అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ ధర్మవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మధు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మధు మాట్లాడుతూ, ధర్మవరం పట్టణంలో సర్వే 650-2లో కొంతమంది నాయకులు దొంగ పట్టాలు తీసుకుని, ప్లంబర్ కాకపోయినా వారు అందరూ కూడా ప్రభుత్వ భూమిని అన్యక్రాంతం చేసుకుంటే అధికారులు, మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించకపోవడంతో మీకు ఏమైనా వాటాలు అందుతున్నాయా అని ప్రశ్నించారు. మరి ప్రభుత్వ భూమి కోట్ల రూపాయల విలువ చేసే భూమి అన్యాక్రాంతం అవుతున్న కూడా అధికారులు ఒకపక్క మంత్రి సైలెంట్‌గా ఉండడానికి ప్రజలందరూ కూడా చర్చించుకుంటున్నారు అని తెలిపారు .ఇవాళ నిజమైన ప్లంబర్స్ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ప్లంబర్స్ ను పట్టించుకునే పాపాన పోలేదని అధికారులపై మండిపడ్డారు. 650-2 సర్వే నెంబర్ లో అనేక అక్రమాలు జరిగినాయని ప్రధాన పత్రికల్లో వచ్చినా కూడా అధికార యంత్రాంగం చర్యలు లేకపోవడం సిగ్గుచేటని తెలిపారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ భూ అక్రమాలపై స్పందించాలని లేకపోతే పెద్దఎత్తున బాధితులతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,పోలా లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు, వెంకటస్వామి,యువజన సంఘం జిల్లా కార్యదర్శి సకల రాజా,ఆదినారాయణ,మల్లి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, నన్న పెద్దన్న, నాగభూషణ, మహిళా సమైక్య పట్టణ నాయకులు లలిత, లింగమ్మ, ఈరమ్మ,ఎలక్ట్రానిక్స్ ప్లంబర్స్, గోవిందు రాజు, తాజ్, సుబ్బయ్య,రామక్రిష్ణ, శ్రీరాములు, నాగరాజు, మనోహర్, బాబావలి, మసూద్, మస్తాన్, కేశవ పాల్గొన్నారు.

పిడిఎస్ రేషన్ స్వాధీనం

విశాలాంధ్ర-ధర్మవరం: హైదరాబాద్-బెంగళూరు హైవే నేషనల్ హైవే-44 రోడ్డు దగ్గర అనంతపురం నుండి పెనుకొండ వైపు అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రైసును స్వాధీనం చేసుకున్నామని బుధవారం రూరల్ ఎస్సై శ్రీనివాసులు సిఐసిటి సురేంద్ర తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వసనీయమైన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక బొలెరో వాహనం పక్కకు ఆపి షేక్ బాబా, వడ్డే అజయ్ కుమార్ పరారవుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా వారి ఊరు సోమందేపల్లి అని తెలపడం జరిగిందన్నారు. వీరు అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో పిడిఎస్ రైసును ప్రజల వద్ద నుండి 20 రూపాయలకు కొని 50 రూపాయలకు సోమందేపల్లిలోని హోటళ్లకు విక్రయిస్తున్నారని తెలిపారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

నీటి కాసుల వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి...

విశాలాంధ్ర-ధర్మవరం : నీటి కాసుల వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ కంటిని కాపాడుకోవాలని రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ నర్సింహులు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ప్రపంచ నీటి కాసుల వ్యాధి (గ్లోకోమా) నివారణ వారోత్సవాలు ఈనెల 9 నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ వ్యాధి గురించి ప్రజలకు తప్పక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని అలాగే అంధత్వాన్ని నివారించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. శరీరానికి బీపీ ఎలాగో కంటికి కూడా బీపీ వంటిది అని తెలిపారు. పుట్టిన బిడ్డ నుండి కూడా ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. అదే పెద్దలకైతే 50 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు ప్రారంభమవుతుందని తెలిపారు. వంశపార్యం పరం మధుమేహం హస్వ దిష్టి, స్టిరాయేడ్ మందులు వాడేవారు కు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నీటికాసుల వ్యాధిలో చాలా రకాలు ఉన్నాయని ఒక రకం వ్యాధిలో కన్ను ఎర్రబడి నొప్పి చేస్తూ ఉంటే కంటి డాక్టర్ను సంప్రదించాలన్నారు. ఈ వ్యాధి నిర్ధారణలో కంటి ఒత్తిడి పరీక్ష కంటిలోని ద్రవం ప్రవాహంలో అడ్డంకులను గుర్తించుట దృష్టి వైశాల్యం పరీక్షించుట కంటి నరాన్ని పరీక్షించుట వల్ల వ్యాధి నిర్ధారింపబడుతుందని తెలిపారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ పోస్టర్ల ఆవిష్కరణ..



విశాలాంధ్ర-ధర్మవరం : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి హిందూపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల రమేష్ తదితరులు బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 14వ తేదీన పిఠాపురం చిత్రాడలో నిర్వహిస్తున్నామని, హిందూపురం పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు లక్షలాదిగా తరలివచ్చి సభను దిగ్విజయం చేయాలని తెలిపారు. ఈ సభ కోసం బస్సులు జీపులు తదితరులు వెహికల్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కాకినాడలో ప్రత్యేకంగా కాపు కళ్యాణ మండపంలో వసతి భోజన సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే పవన్ కుమార్, పెనుకొండ నాయకులు కుమార్, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్తా శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు అడ్డగిరి శ్యాం కుమార్, మల్ల మీద మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

తనకల్లు మండల కేంద్రంలో

విశాలాంధ్ర-తనకల్లు: స్థానిక వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం మండల కన్వీనర్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైఎస్సార్సీపి ఆవిర్భవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పుట్టపర్తిలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ విజయమ్మ, అబ్దుల్ కలం, సంజీవరెడ్డి, ఎంపీటీసీ హిమదర్‌రెడ్డి, రమణారెడ్డి, నిజాం, రెడ్డిపీరా ముస్తఫా, సూర్యనారాయణ, ఆది, నరేంద్ర పాల్గొన్నారు.

సారా తాగిన, క్రయ, విక్రయాలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర-ధర్మవరం: సారా తాగిన, క్రయ,విక్రయాలు జరిపిన కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. బుధవారం ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం మండలంలోని ఓబుల నాయన పల్లి తండా నేలకోట తండా మల్లేనిపల్లి గ్రామాలలో సారా అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సీఐ చంద్రమణి మాట్లాడుతూ సారా తాగడం వల్ల వచ్చే దుష్పరిమాణాలు గురించి ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపర్డెంట్ గోవింద నాయక్, సబ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు స్కూల్ హెడ్మాస్టర్ లు, రెవెన్యూ అధికారులు, వీఆర్వో అండ్ వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఫారెస్ట్ అధికారులు విలేజ్ కానిస్టేబుల్, సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టీటీడీ వారిచే సబ్సిడీ రేట్లపై మైక్‌సెట్లు పంచలోహ, రాతి విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం : ఆంధ్రప్రదేశ్లోని అన్ని జిల్లాలలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు సబ్సిడీ రేటుపై మైసెట్లు పంచలోహ రాతి విగ్రహాలు ఊరేగింపు గొడుగులు పంపిణీ చేయనున్నట్లు ధర్మాచార్యులు నక్కల వెంకటేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలోని శాంతినగర్ అయ్యప్ప స్వామి దేవాలయానికిచ గీతా నగర్ బాటసత్యం దేవాలయానికి, నార్పల మండలం గొల్లపల్లి గ్రామంలో ఉండు అమ్మవారి దేవాలయానికి మైక్‌సెట్ అందించామన్నారు. మన జిల్లాలో గ్రామాలు లేదా పట్టణాలలో గల దేవాలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు సబ్సిడీ రేటు పై మైక్ సెట్‌లు, గొడుగులు, రాతి ,పంచలోహ విగ్రహాల కొరకు దరఖాస్తు చేసుకుంటే వాటిని పంపిణీ చేస్తామని తెలిపారు. దేవాలయ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని ఉపాధ్యాయులు తమ సమస్యలను తీర్చాలని కోరుతూ ఉపాధ్యాయులు క్లస్టర్ చైర్మన్ గోవిందప్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ క్లస్టర్ మీటింగ్లు ఒకేరోజు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సుదూర ప్రాంతాల్లో ఉండే క్లస్టర్లకు చేరుకోవడానికి సమయాభావం సరిపోవడం లేదని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నామని, అలాగే అటెండెన్స్ యాప్ మొరాయించడం, తమ నివాసానికి వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యాలు లేక తీవ్ర క్షోభ అనుభవిస్తున్నామని, ఒకేరోజు పాఠశాల నిర్వహణ క్లస్టర్ మీటింగ్‌లు నిర్వహించకుండా ఒకరోజు పూర్తిగా ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు క్లస్టర్ మీటింగ్‌ను జరిగే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షుడు మూడ్ల గిరియప్ప, ప్రధాన కార్యదర్శి నరసింహప్ప, నాగేంద్ర, వంశీ, గోవిందరాజులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-అగళి : రైతులు రబీ సీజన్లో సాగు చేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి శేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఇరిగేపల్లి,అగళి మదూడి, ఇ నగలురు తదితర గ్రామాల్లోని రైతు సేవ కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ సీజన్లో సాగు చేసిన పంటలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం చేయాలని సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఈ సేవ కేంద్రంలో 4227 మంది రైతులు ఏపీ ఎఫ్ఆర్ఎస్ నమోదుచేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయాల వ్యవసాయ క్షేత్ర సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని కె.ఎన్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడిబండ కెనరా బ్యాంక్ శాఖ ఆర్ఓ ప్లాంట్ వితరణ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గుడిబండ కెనరా బ్యాంకు శాఖ తరుపున పాఠశాల విద్యార్థుల కోసం దాదాపు 90, వేలు విలువచేసే ఆర్ఓ ప్లాంట్ ను, అలాగే గ్రంథాలయానికి అవసరమైన దాదాపు 20వేల రూపాయల విలువచేసే వస్తువులను వితరణ చేసి ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలో గుడిబండ కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య అసిస్టెంట్ మేనేజర్ సాయిసిద్ధార్థను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాధమ్మ గ్రామ పెద్దలు లోకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ లో గురువారం ఎస్సై మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలను డ్రైవర్లు తూచా తప్పకుండా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే అట్టి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పది విద్యార్థులకు స్కూల్ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-రొద్దం: తురకలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల సరస్వతి పూజలో పాల్గొని వారికి పరీక్ష రాసేందుకు అవసరమైన అట్టలు, పెన్నులు, పెన్సిల్, రబ్బర్, మెండర్లు, స్కెలు, ,25 లీటర్ల మంచి నీటి క్యాన్లు వితరణ చేసి వారికి శుభా కాంక్షలు తెలియ జేసిన సీనియర్ న్యాయవాది, రాష్ట్ర వైసీపీ లీగల్ సెల్ సెక్రెటరీ నాగరాజు మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా టీచర్ల సహకారంతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందరూ మంచి మార్కులు సాధించి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్వీ శివ శర్మ, సుబ్రమణ్య శాస్త్రి, న్యాయ విద్యార్థి లిఖిత, హెడ్మాస్టర్, టీచర్లు అన్నపూర్ణ, శ్రీనివాసులు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

విరివిగా పక్కా ఇళ్లు

విశాలాంధ్ర-అగళి: గతంలో ఎన్నడూ లేనివిధంగా అగళి మండలానికి కూటమి ప్రభుత్వం విరివిగా పక్కా ఇళ్లు మంజూరు చేసిందని జడ్పీటీసీ ఉమేష్,కన్వీన కుమార్ స్వామి తెలిపారు. గ్రామాల వారిగా త్వరలో హౌసింగ్ అధికారులు లబ్ధిదారులను కలిసి మార్కింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమారస్వామి సూచించారు. ఇందులో భాగంగా బీసీల ఇళ్ల నిర్మాణం కోసం అదనంగా 50 వేల రూపాయలను కూడా కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో మండలంలో ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేసిన దాఖలాలు లేదన్నారు. మండలానికి 2500 వరకు ఇళ్లు మంజూరు అవుతుండడంతో ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నీరువేరుతుందని ఆశభావాన్ని వ్యక్తం చేశారు.

14న పౌర్ణమి గరుడసేవ, శ్రీవారి కల్యాణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు పౌర్ణమి గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పౌర్ణమి గరుడ సేవకు సేవాకర్తలుగా నాగరత్నమ్మ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, అఖిల, శ్రీలక్ష్మి, ఆదిత్య, అనూష, అద్వైత్‌లు వ్యవహరిస్తారని , భక్తులు వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కోలాటం, అన్నమయ్య సేవా మండలి బృందంచే అన్నమయ్య సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. 14వ తేదీ ఉదయం 10:30 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. సేవాకర్తలుగా ఇంద్రాణి గుర్రం శ్రీనివాసులు నవ్య శ్రీ గుర్రం బాలాజీ ఐశ్వర్యగుర్రం సుదర్శన్ గుర్రం హరినారాయణలు వ్యవహరిస్తారని తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 13, మార్చి 2025

రైతుల పొలాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-బుక్కపట్నం : మండల వ్యాప్తంగా 2024, 25 సంవత్సరానికి గాను 3,774 ఎకరాల విస్తీర్ణంలో వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర సాగు చేసిన పంటలను పంటలను పంట నమోదు చేయగా సూపర్ చెక్ పవర్ కింద బుధవారం కలెక్టర్ చేతన్ పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామాలలో రైతులు చెన్నప్ప, పద్మావతమ్మ సాగు చేసిన వేరుశనగ పంటను, మండల కేంద్రంలో రైతులు వెంకటేష్, శాంత కుమారి వరి పంటలను సూపర్ చెక్ పవర్ కింద పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి రైతు తమ పంట నమోదును తప్పక నమోదు చేసుకోవాలని పంట నమోదు ద్వారా రైతు సంక్షేమ పథకాలు పొందవచ్చని తెలిపారు. అనంతరం పంట సాగు, పంట దిగుబడి, పంట పెట్టుబడి, ఎరువులు వాడకం వంటి తదితరాంశాలపై రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పెట్టుబడులపై కలెక్టర్‌కు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై వి సుబ్బా రావు, ఏడీ స్వయంప్రభ, తహసీల్దార్ షాబుద్దీన్, మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఆర్‌బికే సిబ్బంది గంగాధర్, ఆశాజ్యోతి, సుధాకర్ నాయక్, వీఆర్వోలు సురేష్, వేణుగోపాల్ రైతులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తాడిపత్రి : పట్టణంలోని సంజీవ్ నగర్ రెండవ రోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనసేన పార్టీ రాయలసీమ ఎలక్షన్ జోనల్ సభ్యులు ఆటో ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి జన సైనికులు ప్రాణాలు పణంగా పెట్టి ఎన్నికలలో పార్టీని గెలిపించుకున్నారు. జన సైనిక నాయకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు, గ్రామాలలో రోడ్లు, గ్రామాలలో త్రాగునీటి వసతులు శరవేగంగా చేస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నాడన్నారు. కావున ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ, మహోత్సవం నిర్వహిస్తారు. ఆవిర్భావ దినోత్సవానికి జనసైనికులు లక్షలాదిగా తరలి వచ్చి ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యాక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వాహన సభ్యులు అల్తాఫ్, సాధక్, హరి, కరీం, సాదిక్, హనుమేష్ స్వామి జనసైనికులు పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో పుల్ల జనార్ధన్ భార్య భాగ్యలక్ష్మి కుమార్తె లక్ష్మీ ప్రణతి 10వ పుట్టినరోజు శుభ సందర్భంగా ఆశ్రమంలో బుధవారం అన్నదానం చేశారు.మేనమామ చౌదయ్య, సన్నిహితులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా ప్రణతికి శుభాకాంక్షలు తెలియజేసి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-నార్పల : బీసీ, ఈబీసీలకు చెందిన కమ్మ రెడ్డి క్షత్రియ వైశ్య బ్రాహ్మణ కాపు బలిజ కులాలకు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చి శిక్షణ పూర్తి అయిన తర్వాత కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో గంగావతి బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. 18 నుండి 50 సంవత్సరాల వయసు, లబ్ధిదారులు ఆధార్ కార్డు రేషన్ కార్డు, కులం ఆదాయం సర్టిఫికెట్లు తీసుకొని దగ్గరలోని సచివాలయాల్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టైలరింగ్ శిక్షణ కాలంలో 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండి, ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పరిగణలోకి తీసుకొని కుట్టు మిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మార్చి 8 నుండి 22 వరకు గడువు ఉందన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన

పాల్గొన్న జడ్పీటీసీ ఉమేష్,కన్వీనర్ దాసిరెడ్డి

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని బొమ్మరసనపల్లి గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి, గణపతిస్వామి దేవాలయాల గోపుర ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచినే దేవాలయంలో సుప్రభాత సేవలు, మూలవిరాట్‌లను గంగాజలంతో శుభ్రపరచి వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, రోళ్ల మండల్ కన్వీనర్ దాసరెడ్డి, పూలపల్లి సునీల్ రంగారెడ్డి, లింగరాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు ఘనంగా సన్మానించారు.

ఘనంగా డీజీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ఉరవకొండ : దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్ జన్మదిన వేడుకలను బుధవారం ఉరవకొండలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీజీహెచ్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తున్న సాకే రమేష్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాల నిమిత్తం వారి కష్టసుఖాలలో పాలు పంచుకొని సేవా భావంతో, నిత్యం ప్రజా సేవలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రమేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, రాకెట్ల శ్రీరాములు, ముస్తురు ఎర్రిస్వామి, కడమలకుంట పురుషోత్తం, పీసీ ఫ్యామిలీ ఎస్సీ ఎస్టీ ప్రజా సమైక్య జిల్లా అధ్యక్షులు చిరంజీవి, రామాంజనేయులు,శీనా పెద్దన్న, పాల్తూరు గోవిందు, గంగన్న పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-చిలమత్తూరు: స్థానిక బస్టాండ్ ఆవరణలో నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దీపికా వేణురెడ్డి సూచనలతో చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో వైస్సార్ విగ్రహం దగ్గర వైఎస్ఆర్సీపీ 15 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనముగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో పరీక్షలు రాయాలి

ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు

విశాలాంధ్ర - అగళి : విద్యార్థులు టెన్షన్ పడకుండా మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసుకొని పదవ తరగతి పరీక్షలు రాయాలని ఎం ఇ ఓ చంద్రశేఖర్ నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరదరాజులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విగ్రహానికి వివిధ పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపించారు. పూజ కార్యక్రమం అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని, ప్రశ్నలను ఒక్కసారి అర్థమయ్యేలా చదివి జవాబు వ్రాయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరదరాజులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో అగ్ర నాయకులు

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన గుజ్జల చిన్న అక్కమ్మ గుజ్జల చిన్న నాగముని కుమారుడు బాబు. లక్ష్మీ మునేశ్వరి వివాహ వేడుకకు. దుర్గాంజనేయ స్వామి సన్నిధిలో జరిగిన బడ దాసరి దేవమ్మ. బడదాసరి కుళ్లాయప్ప అల్లుడు భార్గవ్ లావణ్య వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి. మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, మాజీ ఎమ్మెల్యే యామిని బాల. బలపనూరు అశోక్‌తో పాటు టీడీపీ రాష్ట్ర నాయకులు ఆదినారాయణ. గంజే నాగరాజు. అబ్దుల్ జులాన్. సావిత్రమ్మ తదితరులు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ మంత్రి శమంతకమణి, ఎమ్మెల్యే యామిని బాల, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో వైసీపీ నాయకుడు దాసరి వెంకటరమణ

విశాలాంధ్ర-శింగనమల : మండల మండల కేంద్రానికి సమీపంలో గల శ్రీ దుర్గాంజనేయ స్వామి కొండపై జరుగుతున్న వివాహానికి హాజరైన వైసీపీ నాయకుడు దాసరి వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి చిన్న జలాలపురం గ్రామానికి చెందిన మా తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీటీసీ కుళ్లాయప్ప మేనల్లుడు భార్గవ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దీవించారు.

వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థిని చందన

అభినందించిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-అగళి : మండలంలోని మదూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న వి.చందన 10 వ తరగతిలో గణితంలో గ్రాండ్ టెస్ట్‌లో 100 కి 100 మార్కులు సాధించిన వి.చందనను ఎంఈ ఓ చంద్రశేఖర్ నాయుడు, ప్రధాన ఉపాధ్యాయులు దాసేగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఏఓ చంద్రశేఖర్ నాయుడు చిరు కానుకగా "రామాయణంలో పాత్రలు " అనే పుస్తకాన్ని బహుకరించారు.

వైసీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు పోరుబాట

విశాలాంధ్ర-కనేకల్ : కనేకల్ గ్రామంలో బుధవారం వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాక్టర్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మండల ప్రజా ప్రతినిధులు అందరూ బాణసంచా కాల్చి జై జగన్, జై జగన్ మెట్టు గోవింద్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేసారు, అనంతరం వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పరిషత్ ఆఫీస్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు వైసీపీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ..

విశాలాంధ్ర-బెలుగుప్ప : మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ట్రైనీ డీస్పీ అర్షద్ ఆలీ ఎంపీపీ పెద్దన్న ఎంపీడీఓ లక్ష్మినారాయణ ఎంఈఓ మల్లారెడ్డి తహశీల్దారు షర్మిల, ఎస్.ఐ. శివ హెడ్‌మాష్టర్ వెంకట ప్రసాద్ విద్యాకమిటీ చైర్మన్ రుద్రయ్య పాల్గొన్నారు. 75 మంది పదవ తరగతి విద్యార్థులకు ఎంఈఓ సొంత ఖర్చులతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

ప్రజలకు వైసీపీ అండగా ఉంటుంది..

విశాలాంధ్ర గుంతకల్ : ప్రజలకు కార్యకర్తలకు వైసీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో శక్తివంతమైన రాజకీయ పార్టీగా ఎదిగిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సుదీర్ఘ కాలంలో పార్టీ నిరంతరం ప్రజలతోనే ఉంది, ప్రజల కోసం పనిచేస్తూనే ఉంది. అధికారంలో ఉన్న ఆ ఐదేళ్లలో దేశ రాజకీయ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఏ పార్టీ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని అందించింది. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, సుస్థిర ఆర్థికవృద్ధిని సాధించడం, దేశంలోనే రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. విలువలకు విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచిన పార్టీ పట్ల, నా పట్ల నమ్మకంతో విశ్వాసంతో నాతో నడుస్తున్న పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వై.నైరుతిరెడ్డి, కౌన్సిలర్లు లింగన్న, అరుణ, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, యువజన విభాగ నాయకుడు అబ్దుల్ బాసిద్, వైయస్సార్ నాయకులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు సేవలందిస్తాం..

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో (ప్రభుత్వ ఆసుపత్రిలో) రోగు లకు 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వైద్యాధికారి రోహినాథ్ తెలిపారు. బుధవారం ఆస్పత్రిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు, వైద్యాధికారిగా నూతనంగా ఆస్పత్రికి రావడంతో ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ రోహినాథ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన ప్రతిరోగిని మంచిగా పలకరించి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, హాస్పిటల్లో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు వైద్యం అందిస్తామన్నారు. వైద్యులు రంగనాయ కులు, చంద్రకళ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో బుధవారం కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు స్థల పరిశీలన చేశారు. గ్రామ శివారులోని 348 సర్వే నెంబర్ లో 52 ఎకరాలు భూమిని పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో గ్రామ పర్యటనలో వచ్చిన సందర్భంగా ఆదర్శ గ్రామంలో భాగంగా గురుకుల పాఠశాల, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి 4 ఎకరాలు, కుటీర పరిశ్రమలు నిర్మాణాలకు 52 ఎకరాలు పరిశీలించినట్లు తెలిపారు. తహశీల్దార్ మునివేలు, సర్వేయర్ రవితేజ, వీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతి..

విశాలాంధ్ర-ఉరవకొండ : స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో శ్రీ రేణుకాచార్యుల జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా గవిమఠం సంస్థాన ఉత్తరధికారి కరిబసవ రాజేంద్ర స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మంలో స్పష్టమైన వీరశైవ ధర్మ సంస్థాపన చేసిన మొట్టమొదటి వారు రేణుకాచార్యుల స్వాముల వారని తెలిపారు. వీరశైవ మతంలో అన్ని ఉపకులాలు ఐక్యంగా సంఘటితమై వీరశైవ ధర్మ సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయ కులు రాకెట్ల వీరేష్ స్వామి, ఆమిదాల యోగిస్వామి, కిరణ్ స్వామి, మఠ రామలింగ స్వామి, పాటిల్ నాగనగౌడ్, దేశాయ్ గంగాధర్, చంద్రిక మల్లికార్జున ఆర్‌డీటీ మల్లికార్జున, పాటిల్ నిరంజన్‌గౌడ్, దేశాయ్ వీరేష్ పాల్గొన్నారు.

జై కిసాన్, నిస్వార్థ ఫౌండేషన్ సేవలను అభినందించిన ఎస్పీ

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎస్పీ ఆఫీసు కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జరిగిన అనంతపురం ఎన్జీవో సమ్మేళనం కార్యక్రమంలో అనంతపురం జిల్లాలో వివిధ రంగాలలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు చేస్తున్న సామాజిక, పర్యావరణ చైతన్య కార్యక్రమాలను ఎస్పీ జగదీష్ అడిగి తెలుసుకున్నారు. ఉరవకొండ ప్రాంతానికి చెందిన నిస్వార్థ ఫౌండేషన్, జై కిసాన్ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ అభినందించారు ఫౌండే షన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ అందరినీ ఒకే వేదిక మీదికి తెచ్చిన డిస్కవరీ అనంతపురం అధినేత అనిల్‌కుమార్‌ని ఎస్పీ అభినందించి నట్లు తెలిపారు. జై కిసాన్ ఫౌండేషన్ సహా వ్యవస్థాపక అధ్యక్షులు రజిని కుమారి నిస్వార్థ ప్రతినిధి ముక్తం శ్రీనివాసులు పాల్గొన్నారు

గుండాల తండాలో సమీక్ష

విశాలాంధ్ర-గుంతకల్: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా గుంతకల్ మండలంలోని గుండాల తండాకు శనివారం కలెక్టర్ డాక్టర్ వినోద్ గుండాల తండా గ్రామాన్ని సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిస్ట్రిక్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి.రామాంజనేయులు, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎమ్మార్వో రమాదేవి, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, హాజరై గుండాల తండాలో శానిటేషన్, నీటి కొళాయిలు, వ్యవసాయం ఉత్పత్తుల, రోడ్లు డ్రైనేజీలు చెత్తబుట్టల విధానంపైన అలాగే ఊరికి స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో బోర్లు వేయించాలని అన్నారు.

గ్రానైట్ నాపరాళ్ల పరిశ్రమల సమస్యలను పరిష్కరించండి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి వినతి..

విశాలాంధ్ర-తాడిపత్రి : గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి గ్రానైట్ నల్లబండల పరిశ్రమల యజమానులతో కలిసి బుధవారం అమరా వతిలోని సచివాలయ కార్యాలయంలో చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తూ తాడిపత్రి ప్రాంతం శరవేగంగా అభివృద్ది చెందడంలో ప్రధాన పాత్ర పోషించాయన్నారు. గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ సర్ చార్జీలు, రాయల్టీ చార్జీలు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా దివాలా తీసిన గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలను ఆదుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. దీనికి చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మహిళలతోనే సుస్థిరాభివృద్ధి..

..వీసీ సుదర్శన్ రావు

విశాలాంధ్ర-జెఎన్‌టీయూఏ : మహిళలతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమని జేఎన్టీయూఏ వీసీ ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఉమెన్ ఎంపవర్మెంట్, కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ, ఎస్కేయూ ఇన్చార్జి వీసీ ఆచార్య బి.అనిత, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.చిన్నరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జేఎన్టీయూ వీసీ మాట్లాడుతూ.. మహిళలు క్రీడా, సైనిక, సేవ, వైమానిక రంగాల్లో తమదైన ప్రతిభ చాటుతూ దేశభ్యున్నతికి తోడ్పాటును అందిస్తున్నారని.. మహిళల్లో ఓర్పు, శాంతం, పట్టుదలతో కుటుంబ, దేశం రెండు కళ్ళుగా భావిస్తూ ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ఎస్కేయూ ఇంచార్జి ఉపకులపతి ఆచార్య బి.అనిత మాట్లాడుతూ.. నేటి భారతీయ మహిళల విద్య, మీడియా, కళలు, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాలలో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్. వి.బి. చిత్ర, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ అజిత, డైరెక్టర్లు, జి.వైశాలి ఘోర్పాడే, పి.సుజాత, ఆర్.కిరణ్మయి, ఆర్.పద్మ సువర్ణ, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య కె.మాధవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సమిష్టి కృషితో సైబర్ నేరాలపై అవగాహన

..ఎస్పీ జగదీష్

విశాలాంధ్ర అనంతపురం క్రైం: ఎన్జీవోల ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలు, క్రైం అగనెస్ట్ ఉమెన్ పట్ల ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు పోలీస్ శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని ఎస్పీ జగదీష్ కోరారు. బుధవారం జిల్లాలోని ఎన్జీవోలు (స్వచ్ఛంధ సేవా సంస్థలు) ప్రతినిధులతో స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే చాలా స్వచ్ఛంధ సంస్థలు జిల్లాలో వివిధ మార్గాలలో ప్రజలకు స్వచ్ఛంధంగా సేవలు అందిస్తు న్నాయని, ఈ సేవలతో పాటు పోలీసులతో కలిసి ప్రజల్లో సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలు, క్రైం అగనెస్ట్ ఉమెన్ తదితర నేరాలపై ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషి చేయాలని కోరారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించకుండా రోడ్డు ప్రమాదాల బారినపడి అర్థాంతరంగా చనిపోతుండటం అందరికీ బాధ కల్గిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం పోలీసుశాఖ, ప్రభుత్వం చాలా చర్యలు చేపట్టిందన్నారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, ఫోక్సో మరియు మహిళా సంరక్షణ చట్టాలు, తదితర అంశాలపై ఇప్పటికే అవగాహన కల్పించామని చెప్పారు.